# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

మంగళవారం
29 07 2025

సంపుటి 1 సంచిక 90

పేజీలు : 03

UDYAM /
TS-09-0148996


## దివ్య దేశ్‌ముఖ్ కి సీఎం అభినందనలు..



**దశ, హైద్రాబాద్:** అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో విజయం సాధించి గ్రాండ్‌మాస్టర్‌గా అరుదైన రికార్డును కైవసం చేసుకున్న దివ్య దేశ్‌ముఖ్ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఫిడే ప్రపంచ కప్ ఫైనల్‌లో దేశానికే చెందిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి తో తలపడి టైటిల్ సాధించగా, వీరద్దరూ ఫైనల్స్‌కు చేరడం దేశానికి గర్వకారణమని అన్నారు. అంతరాజాతీయ చెస్ ఫెడరేషన్‌లో సెమీఫైనల్‌లో ప్రపంచ దిగ్గజాలతో తలపడి ఫైనల్‌కు చేరిన వీరిద్దరూ దేశ ప్రతిష్టను మరింత పెంచారని కొనియాడారు. అవకాశాలు లభిస్తే మహిళలు ఏదైనా సాధిస్తారనడానికి వీరిద్దరూ ఉదాహరణ అని అన్నారు. ఫిడే మహిళా చెస్ ప్రపంచ కప్‌లో ఇప్పటివరకు భారత క్రీడాకారణి సెమీస్‌కు చేరిన చరిత్ర లేకపోగా ఏకంగా ఇద్దరు క్రీడాకాణిలు ఫైనల్స్‌కు చేరడం గర్వకారణమని పేర్కొన్నారు భవిష్యత్తులో వీరిద్దరూ మరిన్ని విజయాలు సా... ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



## షటిల్ ఆడుతుంటే గుండె పోటు ..

షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి 25 ఏళ్ల యువకుడు మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడు గుండ్ల రాకేశ్ (25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, ఉప్పల్ బాగాయత్ ఎలైట్ గేమర్ గ్యారేజ్, విక్రాంత్ బ్యాట్మెంటన్ అకాడమీలో సోమవారం ఉదయం షటిల్ ఆడుతుండగా రాకేశ్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటివారు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**దశ, ఎల్బీనగర్**

# ఇందిరమ్మకు రుణాలు!

డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు.

ఖమ్మం జిల్లాలో 1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు .

**దశ, ఖమ్మం:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పునాది నిర్మాణానికి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. లబ్ధిదారులు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొంది నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.74 లక్షల మంది పనులు మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లాలో 1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు మంజూరు కాగా, ఆగస్టు నెలాఖరుకు మరిన్ని జిల్లాల్లో రుణాలు మంజూరు చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ముందు లబ్ధిదారులు ఖర్చు పెట్టుకుంటే ఇంటి నిర్మాణం జరిగే వివిధ దశల్లో మొత్తం 4 విడతలుగా రూ.5 లక్షల సాయం అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తయితేనే మొదటి విడతగా




రూ.లక్ష సాయం ప్రభుత్వం నుండి అందుతాయి. ఈ దశను చేరుకోవడానికి కూడా డబ్బులు లేక కొందరు నిరుపేదలు మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో సర్కార్ తీపి కబురు చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిరుపేద లబ్ధిదారులకు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ రుణ సాయం రాష్ట్రంలోని పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 1.74 లక్షల మంది

..మిగతా 3వ పేజీలో →



## ఫార్మాసిటీని రద్దు చేయాలి

**ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఫార్మాసిటీ రైతుల ఆందోళన**

**10 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం**

**ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి హామీతో విరమణ**

**దశ, ఎల్బీనగర్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మసిటీని రద్దు చేస్తానంటూ ఇచ్చిన హామీ మేరకు, ఫార్మాసిటీ రద్దుచేసి తమ భూములను తమకు ఇప్పించాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. దిల్ సుఖ్ నగర్ లోని నివాసం ఉంటున్న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇంటి వద్ద సోమవారం యాచారం మండల పరిధిలోని నానక్ నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మేడిపల్లి, నాలుగు గ్రామాలకు చెందిన 200 మంది ఫార్మాసిటీ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మసిటీని రద్దు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి

..మిగతా 3వ పేజీలో →



## ప్రజావాణిలో అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీదారు సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా హెచ్ఓడి లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, వేణు గోపాల్, మంగతాయారు, సి ఈ రత్నాకర్, హౌసింగ్ సి ఈ నిత్యానంద, తదితరులు పాల్గొన్నారు.

**దశ, హైదరాబాద్:**



## జలపాతం దగ్గర ఏడుగురు మిస్సింగ్

వర్షాకాలం ప్రారంభం కావడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని జలపాతాలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. అయితే మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొన్ని జలపాతాలు ఆకర్షిస్తాయి. కానీ ఇక్కడికి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే ఇలాంటి వాటిని గుర్తించి పోలీసులు నిషేధించారు.

**దశ, హైద్రాబాద్**

## హైదరాబాద్ కు మెట్రో జైపాల్ రెడ్డి వల్లే సాధ్యమైంది

**అయన స్ఫూర్తితోనే నల్గొండ నుండి 30 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నాను: మంత్రి కోమటి రెడ్డి**

**దశ, హైదరాబాద్:** కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పీవీ నరసింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్) లోని స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పల్లె నుండి ఢిల్లీ దాకా ఎదిగిన భారత రాజకీయ శిఖరం, బెస్ట్ పార్లమెంటిరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి. 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అక్కడి నుండే వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత మహబూబ్ నగర్,మిర్యాలగూడ,చేవెళ్ల పార్లమెంట్ స్థానాల నుండి ఐదు సార్లు లోక్సభ సభ్యుడిగా గెలుపొందారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా,రాజ్య సభలో ప్రతిపక్ష నేతగా కూడా పనిచేసిన అపార రాజకీయ అనుభవం కలిగిన నేత జైపాల్ రెడ్డి. ఉత్తమ పార్లమెంటేరియన్గా పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీగా ఘన కీర్తి పొందారని అన్నారు.




## ప్రజావాణిలో ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**దశ, రంగారెడ్డి :** ప్రజావాణిలో ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా

..మిగతా 3వ పేజీలో →

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం..



**మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**దశ, హైదరాబాద్:**

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు

# భారతీయులు వెళితే అధోగతే..

**అమెరికా ట్రంప్ రాకతో ఒడిదుడుకులు.. తలతిక్క నిర్ణయాలు.. తలా తోక లేని ఉత్తర్వులు.**

**దశ, హైదరాబాద్:** అగ్రరాజ్యం.. ప్రపంచానికి పెద్దన్నగా చెలామణి అవుతున్న అమెరికా.. అధ్యక్ష పగ్గాలు జనవరిలో డొనాల్డ్ ట్రంప్ చేపట్టారు. అప్పటి వరకు సాఫీగా సాగుతున్న అమెరికా ట్రంప్ రాకతో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. తలతిక్క నిర్ణయాలు.. తలా తోక లేని ఉత్తర్వులు, ఆదేశాలతో ఇటు అమెరికన్లను, అటు అమెరికాలోని విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను భయపెడుతున్నారు. తాజాగా భారత ఐటీ నిపుణులే లక్ష్యంగా అమెరికాలోని ఐటీ కంపెనీలకు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. భారతీయులను నియమించుకోవద్దని ఆదేశించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే అడుక్కు తినాల్సి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా దశాబ్దాలుగా అగ్రరాజ్యంగా కొనసాగుతుండడానికి భారతీయులు కూడా కారణం. ఇండియన్ ఐటీ ప్రొఫెషనల్స్.. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో కీలకంగా ఉన్నారు. అనేక సంస్థల ఆర్థికాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. అమెరికాకు ఆర్థికంగా, సామాజికంగా మంచి గుర్తింపు తెస్తున్నారు. ఇండియన్స్ లేకుంటే.. అమెరికా లేదు అని ఆ దేశ మాజీ అధ్యక్షుడు మూడు దశాబ్దాల క్రితం అన్న మాటలు ఇక్కడ ప్రస్తావించుకోవాలి. మన ఐటీ నిపుణుల కారణంగానే 30 శాతం అమెరికా ఐటీ కంపెనీలు మనుగడ సాధిస్తున్నాయి.




ఇదిలా ఉంటే.. భారతీయులపై ట్రంప్ వ్యతిరేకత గురించి ఆలోచిస్తే ఆయన కోణంలో అది సరైనదే. 'అమెరికా ఫస్ట్' పాలసీ ఆయన వ్యక్తిగతమైనది.. దీనిని అమెరికా అంతటా బలవంతంగా రుద్దడం సరికాదని నిపుణులు పేర్కొంటున్నారు.ట్రంప్ వ్యతిరేకత.. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకుని భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే, అమెరికాలోని టెక్నాలజీ, ఇతర కీలకమైన రంగాలలో ప్రభావం ఉంటుంది. భారతీయులు హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఈ ఉద్యోగాలు అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవి. ఈ ఉద్యోగాలు తగ్గితే, అమెరికన్ కంపెనీలు నైపుణ్యం గల ఉద్యోగుల కొరత ఏర్పడుతుంది. ఇది ఖర్చులు, సమయం పెరుగుతుంది. అలాగే, భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే, భారత్‌లోని టెక్నాలజీ రంగం మరింత బలోపేతం అవుతుంది, ఇది భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది. అమెరికా నుంచి కంపెనీలు తరలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే అక్కడ ఉన్నవారికి ఉద్యోగాలు కాకపోగా.. అమెరికా ఆర్థిక పరిస్థితి ఏడాది తిరగకుండానే దారుణంగా పడిపోతుంది. దీంతో నంబర్ వన్ స్థానం చైనా సొంతం అవుతుంది. అదే జరిగితే అమెరికా అడుక్కు తినాల్సిన పరిస్థితి వస్తుంది.

దశ
నిజం.. నిర్భయంగా..





## సిగాచి బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదు: హరీష్ రావు

**దశ, సంగారెడ్డి:** మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం నాడు సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం తమని పట్టించుకోవడం లేదని, ఇప్పటి వరకు పరిహారం దిక్కులేదు అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తరువాత అయన ఇతర బీఆర్ఎస్ నేతలు, బాధితులతో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని అడిషనల్ కలెక్టర్ తో మాట్లాడారు. నష్టపరిహారం కోటి ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని వివరించారు. డెడ్ బాడీల కోసం కుటుంబాలు కన్నీరు మున్నీరు అవుతున్నాయని చెప్పారు. సిగాచి కంపెనీ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం కోటి పరిహారం ఇవ్వకుంటే టెంట్ వేసి కూర్చొంటాం. వారికి పరిహారం అందేదాక, న్యాయం జరిగేదాక టెంట్ తీయం. బాధితుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## ప్రజల ఆలోచన కాదు సందేహం!

ప్రపంచ చట్ట
సభలను సూచార
ప్రజా ప్రతినిధుల
తీరు గమనించార

ప్రజాస్వామ్యయుతంగా
నడిపిస్తున్నారా
ప్రజా గొంతుకలై
ప్రసంగాలు చేస్తున్నారా

సమయానుకూలంగా
చర్చలుంటున్నాయా
కాలాన్ని వృధాచేసే
కార్యక్రమాలు చేస్తున్నారా

అడిగిన ప్రశ్నలకు
అధికారంపక్షం జవాబులిస్తున్నద
ప్రతిపక్షం దాని పాత్ర
సక్రమముగా నెరవేరుస్తున్నద

నాయకుల హాజరు ఉన్నదా
నడిమిట్లనే పోతున్నర
అవసరమున్నపుడు
మాట్లాడుతున్నర,
అరుపులు కేకలతో ఆగం
పట్టిస్తున్నర

ఆరోగ్యవంతమైన చర్చచేస్తున్నర
హక్కులకొరకు పోరాడుచున్నర
కుర్చీలలో కూర్చుంటున్నారా
లోనకుస్తీ,బయటదోస్తి అన్నట్లు
ఉన్నారా


వ్యక్తిగత విమర్శలు
చేసుకుంటున్నారా
చట్ట నిబంధనల ప్రకారము
వ్యవహరిస్తున్నారా, సభను
సక్రమంగా నడిపిస్తున్నార

వారునాయకులు, ప్రతినిధులు
ప్రజగొంతుకలు,
హక్కులసాధకలు
ఆదర్శంగాఉండాలి,ప్రజాధనం
వృధాచేయకుండా
దేశాన్నిఅభివృద్ధిచేయాలని
ఆశీద్దాం

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

# రెచ్చిపోతున్న కల్తీ మద్యం మాఫియా

- తెలంగాణ టూ ఆంధ్రా వయా తెలంగాణ సరిహద్దు
- భూమిని తవ్వుతున్న కొద్దీ కేసుల కల్తీ మద్యం



**దశ, నల్గొండ :** తెలంగాణ టూ ఆంధ్రా వయా తెలంగాణ సరిహద్దు గ్రామాలు.. ఇలా కల్తీ మద్యం మాఫియా రెచ్చిపోతోంది. తాజాగా సూర్యపేటలో ఏకంగా పంటపొలాలు తవ్వితే రెండు వేరు వేరు చోట్ల భారీగా కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న వేళ కల్తీ సరకును ఇలా భూమిలో దాచి మరీ సిద్ధం చేశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. తెలంగాణకు సరిహద్దు జిల్లా సూర్యపేట కావడంతో ఈ ప్రాంతాన్ని అడ్డగా చేసుకున్న కల్తీ మద్యం కేటుగాళ్లు భారీ స్థాయిలో సరకు నిల్వ చేయడంతోపాటు ఆంధ్రాలోని వివిధి జిల్లాలకు ఇక్కడి నుంచి కల్తీ సరకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ మద్యం మాఫియాను సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో కీలకంగా మారిన ప్రవీణ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా రంగంలోకి దిగిన ఎక్సైజ్ పోలీసులు సూర్యపేటలోని మేళ్ల చెరువుకు సమీపంలోని వ్యవసాయ భూముల్లో జేసిబిలతో తవ్వకాలు చేపట్టారు.జేసీబీలతో భూమిని తవ్వుతున్నకొద్దీ కేసుల కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వేలాదిగా వివిధ బ్రాండ్ లకు చెందిన మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న మరో వ్యక్తి ఇచ్చిన సమాచారంతో దొండపాడు, రామాపురంలో తవ్వకాలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ అధికారులకు కళ్లుచెదిరేలా మద్యం సీసాల డంప్ లు దర్శనమిస్తున్నాయి. భూమిని త్వవుతున్న కొద్దీ కాటన్ల లో నిల్వ ఉంచిన కల్తీ మద్యం కంటపడుతోంది. 2014 ఎన్నికల సమయంలోనే ఇక్కడ భారీగా కల్తీ మద్యం భూమిలో దాచి ఉంచి, ఇక్కడి నుంచే తెలంగాణ, ఆంధ్రాలోని వివిధ జిల్లాలకు సరఫరా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ముఖ్యంగా ఏపీలోని బెల్టు షాపులే టార్గెట్‌గా గతేడాది నుంచి కల్తీ మద్యం దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లుగా గుర్తించారు. ఇదిలా ఉంటే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలకు సరఫరా చేసేందుకు భారీగా కల్తీ మద్యం నిల్వ ఉంచడంతోపాటు, మద్యం తయారీకి ఉపయోగించే 14వేల లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నారంటే ఎంతలా కల్తీ మద్యం తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా సరఫరా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.ఇంతలా మందుబాబుల ప్రాణాలు తీసే ఈ కల్తీ మద్యం హైదరాబాద్ కేంద్రంగా తయారవుతున్నట్లుగా గుర్తించారు. ఉప్పల్ లోని శ్రీకృష్ణా ఫార్మసీ నుంచి కల్తీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈ ఫార్మసీ నుంచి నవ్వా ఎజెన్సీ స్పిరిట్ కొనడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా రైస్ మిల్లులను అడ్డగా చేసుకుని కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. సుమారుగా 180 ప్రముఖ బ్రాండ్లకు చెందిన మద్యాన్ని కల్తీ చేయడంతోపాటు, దాదాపు అదే బ్రాండ్‌ను పోలి ఉండేలా మద్యం తయారు చేసి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.ప్రమాదకరమైన రెక్టిఫైడ్ స్పిరిట్ ను మద్యం తయారిలో వాడటంతోపాటు, ఎంత మోతాదులో స్పిరిట్ కలపాలి అనేదాని కోసం ప్రత్యేకంగా మిషన్ ఏర్పాటు చేసుకుని స్పిరిట్ 25 శాతం ఉండేలా కల్తీ సరకు తయారు చేస్తున్నారు. బాటిల్ కు రెండు వైపులా లేబుల్ వేయడం , మూతలు ఫిక్స్ చేయడం ఇలా దాదాపు ఒరిజినల్ ను తలపించేలా మద్యం తయారు చేస్తున్నారు. కల్తీ మద్యం మాఫియాకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే పరారీలో ఉన్న మరో నలుగురి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

## యాదగిరిగుట్ట దేవస్థానంలో.. ప్రక్షాళనకు పది కమిటీలు

**దశ, యాదగిరిగుట్ట:** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పాలన కొత్త పుంతలు తొక్కుతోంది. పాలనలో పారదర్శకత లోపాల నివారణ కోసం ప్రక్షాళనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. భక్తులకు మెరుగైనr సౌకర్యాలు దర్శనాలు కల్పించేందుకు పది కమిటీలను నియమించారు. పాలనాపరంగా నిర్వహణలో అన్ని విభాగాలలో పారదర్శకత పాటించేందుకు లోపాలను నివారించేందుకు అంతర్గతంగా ఆడిటు చేసుకునేందుకు అదేవిధంగా భక్తులు స్థానికుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసేందుకు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు దేవస్థానంలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన లోపాలను సూచనలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి దృష్టికి తీసుకువచ్చే విధంగా ఈ కమిటీలు పరిచారని నిర్ణయించారు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఈ పది కమిటీలకు చైర్మన్గా వ్యవహరిస్తారు దేవస్థానం అధికారులు సిబ్బందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు

**పది కమిటీలు ఇవే....**

1) దేవాలయం, ప్రసాదాలు, అన్నదానం పర్యవేక్షణ కమిటీ .2) క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ. 3) సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఓవర్ సైట్ కమిటీ. 4) పారిశుద్ధ్యం, పరిశుభ్రత పర్యవేక్షణ కమిటీ. 5) విద్యుత్ ,సీసీ కెమెరాలు, వైర్లెస్ వ్యవస్థ, బ్యాటరీ వాహనాలు, ఏసీలు, లిఫ్టుల పర్యవేక్షణ కమిటీ. 6) వసతి సౌకర్యాల పర్యవేక్షణ కమిటీ .7) విద్యాసంస్థల పర్యవేక్షణ కమిటీ. 8) రెవెన్యూ యాజమాన్య కమిటీ .9) లీజులు, కిరాయి యాజమాన్య కమిటీ.10) అకౌంట్స్మేనేజ్మెంట్ కమిటీ.

# దేవుడి పేరుతో కబ్జాల పర్వం

- ప్రజావాణి ఫిర్యాదుల్లో అవే అగ్రభాగం..
- హైడ్రా ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు




**దశ, హైదరాబాద్:** రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములు.. ఇలా ఏవైనా.., ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడాలన్నా.. కబ్జాలు చేయాలన్నా దేవుడిని రంగంలోకి దించేస్తున్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాలంటూ నివాసితులను నోరెత్తకుండా చేస్తున్నారు. మాలాంటి వారు ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తుంటే.. కుల, మత సంఘాలను వెనుకేసుకు వచ్చి దాడులకు పాల్పడుతున్నారు.. కాలనీలు, బస్తీలే కాదు.. కొత్తగా వచ్చిన గేటెడ్ కమ్యూనిటీలు, హెచ్ ఎండీఏ అనుమతి పొందిన లేఔట్లలో కూడా ఇదే దందా కొనసాగుతోంది అని పలువురు కాలనీ, బస్తీవాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 51 ఫిర్యాదులందగా.. అందులో అధిక భాగం రహదారులు, నాలాలు ఆక్రమణలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఆంజనేయ నగర్లో దాదాపు ఎకరం పార్కులో జెండా పాతి కొంతమంది కబ్జాకు పాల్పడుతుంటే.. సికింద్రాబాద్ చికోటీ గార్డెన్స్ పరిసరాల్లో గుడికి అనుసంధానంగా షెడ్డులు వేసి రోడ్డును ఆక్రమిస్తున్నవారు మరికొందరు. పటాన్ చెరు ప్రాంతంలో 500ల విల్లాలున్న ఏపీఆర్ ప్రవీణ్ లగ్జీరియాలో కూడా ఎకరం పార్కు స్థలంలో కొంతమేర గుడి కట్టి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా పరిస్థితిని ఫిర్యాదుదారులకు వివరించి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, సొసైటీలు ఖాళీ స్థలాలను ప్లాట్లుగా అమ్ముకుంటే వారిపైన చర్యలు తీసుకోవాలని పలువురు అసెట్ ప్రొటెక్షన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి

**ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి విడుదల**




**దశ, హైదరాబాద్:** తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుంది.దీనితో తుంగభద్ర ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో 96, 836 క్యూసెక్కులు ఉండగా ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి 1,00, 720 క్యూసెక్కులు నీటిని దిగువకు అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలుగా ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 75 టిఎంసిలుగా ఉంది. గేట్ల సమస్య కారణంగా ఈ ఏడాది 80 టిఎంసిలే అధికారులు నిల్వ చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

## జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల



**దశ, హైదరాబాద్:** జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీనితో జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు జూరాల జలాశయానికి ఇన్ ఫ్లో1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో 92,556 క్యూసెక్కులుగా ఉంది.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టిఎంసిలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ఐదు కేంద్రాలలో కొనసాగుతోంది.

## కొత్తగూడెం భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం



**దశ, కొత్తగూడెం భద్రాద్రి:** కొత్తగూడెం భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం సృష్టించాయి. మావోయిస్టు అమరవీరుల సభలు జరపాలని బ్యానర్లు, కరపత్రాలు కనిపించాయి. ఆర్. కొత్తగూడెం, దానవాయిపేటలో పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు అమరవీరుల స్తూపాలు నిర్మించాలని పిలుపునిచ్చాయి. మరో వైపు భూపాలపల్లిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ముకునూరు, నీలంపల్లి, బూరుగూడెంతో పాటు సర్వాయిపేట గ్రామాల్లో పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు అగ్రనేతలు కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడి జన జీవన విధానంలో కలవాలంటూ పోస్టర్లు కనిపించాయి. మావోల మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలని పోస్టర్లలో ఉన్నాయి. మావోయిస్టు ఆత్మపరిరక్షణప్రజాఫ్రంట్ పేరిట పోస్టర్లు ఉన్నాయి.



# పేదవారి పాలిటి వరం కేంద్ర ప్రభుత్వ చొరవ

- జెనివిస్ రెమిడీస్ 'జెనరిక్ మెడిసన్'కు బ్రాండ్ అంబాసిడర్గా సినీ స్టార్ సుమన్

**దశ, హైదరాబాద్:** తక్కువ ధరల్లోనే జెనరిక్ మందులు అందుతున్నాయని అందుకే వాటికి తాను బ్రాండ్ అంబాసిడర్గా ఉన్నానని ప్రముఖ సినీ హీరో సుమన్ పేర్కొన్నారు. యూసుఫ్ గూడ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన జెనివిస్ రెమిడీస్ స్టోర్ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలతో ఇతర కంపెనీలు ఇచ్చే డిస్కౌంట్ కంటే భారీ ఎత్తున జనరిక్ మందులు తగ్గింపు ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే సామాన్యులకు అందుబాటులో ఉండేలా వారికి అనువైన ధరలకే దొరకడం శుభ సూచికమని సీనియర్ నటుడు సుమన్ తెలిపారు. కాగా సినీ, టీవీ టెక్నీషియన్స్కు అధిక రాయితీ ఇవ్వ నున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ ఫస్ట్ చైర్మన్ బీఎస్. రాములు తదిత రులు పాల్గొన్నారు.

# సిట్ విచారణకు హాజరైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి పై ఫిర్యాదు



**దశ, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా విచారణ జరుపుతున్న సిట్ అధికారులు ఇటీవల విచారణకు హాజరుకావాలని బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించి, సోమవారం నాడు జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్ లోని సిట్ ఆఫీసులో అయన హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పై ఫిర్యాదు చేశాను. రేవంత్ రెడ్డి సొంత పార్టీ మంత్రుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు. పెగాసెస్ వంటి సాఫ్ట్ వేర్ సహాయంతో మంత్రుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు . డార్క్ వెబ్ లో కొన్ని అరుదైన టూల్స్ వాడి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి చేస్తున్న ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేయాలి. రేవంత్ రెడ్డిని కూడా విచారణకు పిలవాలని డిమాండ్ చేసాను. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విచారించే వరకు పోరాడుతామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేసే ఫోన్ ట్యాపింగ్ కు,కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మద్దతు కూడా ఉంది. రెండు పార్టీలు కలిసే ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు. మంత్రులతో పాటు, వ్యాపారవేత్తలు,ప్రముఖులు,జర్నలిస్టుల ఫోన్లు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్యాప్ చేస్తున్నట్టు ఆరోపణ. ఫోన్‌ట్యాపింగ్‌కు మరియు బిఆర్ఎస్ కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం. కేసిఆర్ ప్రజలను నమ్ముకొని,ఆయన చేసిన మంచి పనులు నమ్ముకొని పని చేశారు కానీ ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడలేదని తెలిపారు.

# దశ
నిజం.. నిర్భయంగా..


03
మంగళవారం
29-7-2025
WWW.DASHANEWS.COM




## మార్గం రాజేశ్ కు "తెలంగాణ సన్మాన్" పురస్కారం


దశ, ఎల్బీనగర్ : సమాజ సేవకుడు, అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్ కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో సోమవారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర సాధనలో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అవార్డు అందజేసి, సన్మానించారు. అవార్డు అందుకున్నవారిలో ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కు "సామాజిక సేవలో తెలంగాణ సన్మాన్" పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ .. ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్, తన విద్యార్థులకు అత్యాధునిక వసతి , లైబ్రరీ, కంప్యూటర్ లాబ్, భోజన సౌకర్యాలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అద్భుత విద్యావకాశాలు కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

# జలపాతం దగ్గర ఏడుగురు మిస్సింగ్



**దశ, వరంగల్:** వర్షాకాలం ప్రారంభం కావడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని జలపాతాలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. అయితే మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొన్ని జలపాతాలు ఆకర్షిస్తాయి. కానీ ఇక్కడికి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే ఇలాంటి వాటిని గుర్తించి పోలీసులు కొన్ని జలపాతాల వద్దకు వెళ్లేందుకు నిషేధించారు. అయితే కొంతమంది యువత మాత్రం ఇక్కడికి వెళ్లి.. సరదాగా గడపాలని అనుకున్నారు. కానీ అనుకోని పరిస్థితుల్లో అడవిలో చిక్కుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందంటే?ములుగు జిల్లలో బొగత జలపాతం గురించి అందరికీ తెలసిన విషయమే. వర్షాకాలంలో ఇక్కడ అద్భుతమైన దృశ్యం కనిపిస్తుంది. అయితే ఈ జిల్లాలో కేవలం బొగత మాత్రమే కాకుండా మరెన్నో జలపాతాలు ఉన్నాయి. కానీ ఇక్కడికి వెళ్లేందుకు అనువైన రవాణా మార్గం లేదు. అంతేకాకుండా అక్కడ ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. దీంతో వాటిని నిషేధించారు. అలా నిషేధం ఉన్న జలపాతాల్లో గుడి చెరువు జలపాతం ఒకటి. ములుగు జిల్లాలోని వాజేడు మండలంలోని బొల్లారం అడవిలో ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు వరంగల్ నిట్ లో చదువుతున్న కొందరు విద్యార్థులు ఇక్కడికి వెళ్లారు. వీరిలో నలుగురు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నాయి. . అయితే గుడి చెరువు జలపాతం వద్దకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చీకటి పడింది. దీంతో దారి తప్పారు. ఈ క్రమంలో భయాందోళన చెందిన వారు 100 కు డయల్ చేశారు. దీంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా వీరిని మొత్తానికి పట్టుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు సిబ్బంది కష్టపడి వీరిని పట్టుకొని బొల్లారం గ్రామానికి తీసుకొచ్చారుఈ సందర్భంగా పోలీసులు వారిని మందలించారు. స్నేహితులతో సరదాగా జలపాతాలకు వెళ్లడం సబబే. కానీ నిషేధిత జలపాతాల వద్దకు వెళ్లడంపై కొందరు ఆగ్రహిస్తున్నారు. అంతేకాకుండా సాయంత్రం సమయంలో ఇలా అటవీ ప్రాంతానికి రావడంపై కొందరు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో ఇలా రావడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం బయటకు రావడంతో చాలా మంది తల్లిదండ్రులు అప్రమత్తం అయ్యారు. తమకు దూరంగా చదువుతున్న తమ పిల్లల గురించి ఆరా తీశారు.

అలాగే నిట్ లో చదువుతున్న వారికి తల్లిదండ్రులు ఫోన్ చేసి క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు.అయితే జలపాతాల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున... విద్యార్థులు, యువత ఇక్కడ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాకుండా నిషేధిత జలపాతాల వద్దకు వెళితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇలాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఇంట్లో వారికి లేదా సంబంధిత కళాశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్

**దశ, ఎల్బీనగర్:** హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థుల కోసం ఇంగ్లీష్ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్, టీఎస్ కేసీ సంయుక్తంగా 'కెరీర్ గైడెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన సదస్సు'ను నిర్వహించారు. పోటీ పరీక్షల్లో కెరీర్ నిర్మాణ ఎంపికల ప్రాముఖ్యత, అందుబాటులో ఉన్న వివిధ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ అవకాశాలను వివరించినట్లు కెరీర్ గైడెన్స్ సెల్ ఇంచార్జి దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యార్థులు అకడమిక్ మరియు పోటీ పరీక్షలు తమ కెరీర్ లక్ష్యాల గురించి స్పష్టత మరియు అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేశ్ బాబు సూచించారు. ముఖ్య వక్త మహితా హాజరై, విద్యార్థులకు వివిధ కేంద్ర పోటీ పరీక్షలు, కెరీర్ నిర్మాణ అవకాశాల గురించి వివరణాత్మక వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. నర్సింహ, ఇంగ్లీష్ విభాగం అధిపతి డాక్టర్ డి.మక్లా, పి. విద్యా సాగర్, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. దుర్గా ప్రసాద్, డాక్టర్ కృష్ణ మోహన్ డాక్టర్ వెంకటేశ్వర్లు. జెకెసి మెంటర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**మొదటి పేజీ తరువాయి**

ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (76) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ - 32, ఇతర శాఖలకు - 44, మొత్తం 76 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీని రద్దు చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

తమను మోసం చేసారని, కోట్ల విలువచేసే భూములకు రూ,12 లక్షలు వెలకట్టడం, ప్లాట్లు ఇస్తామని, పారితోషికం అని ఊదర కొడుతున్నరని విమర్శించారు. తమ భూములు లాక్కుంటే తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కట్నంగా ఇచ్చిన భూములు ఫార్మా సిటీలో పోతున్నాయని, అల్లుళ్లు భార్యాబిడ్డలను తమ ఇంటికి పంపిస్తున్నారని వాపోయారు. ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు కానమోని గణేష్, మహిపాల్ రెడ్డి, ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి 2500 ఎకరాల పట్టా రైతుల పేర్లను ఆన్లైన్లో ఎక్కించి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఫార్మసిటీ పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 800 మంది ఫార్మిసిటీ రైతులు 32 కేసులు కోర్టులో వేశారని అందుకుగాను 8 కేసుల్లో అవార్డును భూ సేకరణను హైకోర్టు రద్దు చేసిందని, మిగతా కేసుల్లో స్టే కొనసాగుతోందని చెప్పారు. ఇప్పుడున్న ప్రభుత్వం మరల భూములు కావాలని కోర్టుకు వెళుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. రైతులతో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్, ఆర్డీవో, టీజీఐఐసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 10 రోజుల్లో రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని చెప్పినా బలవంతంగా లాక్కుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, కోదండ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇండ్లను ముట్టడి చేస్తామని ఫార్మాసిటీ రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు ముత్యాల వెంకట్ రెడ్డి, బందే రాజశేఖర్ రెడ్డి, వినోద్, కొండల్, అనంతరెడ్డి, నాగ రాజు, శ్రీకాంత్ నాయక్, బర్ల మల్లేష్, సంగెం మహేందర్, నాలుగు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మకు రుణాలు!

**మొదటి పేజీ తరువాయి**

లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి విడత బిల్లు పొందడానికి కూడా ఆర్థిక స్థోమత లేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా ఇంటి నిర్మాణానికి రూ. 1 లక్ష వరకు రుణం పొందవచ్చు. చెల్లించే సామర్థ్యం ఉన్నవారికి రూ. 2 లక్షలు వరకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు.ఈ రుణాలు పొందిన కొందరు లబ్ధిదారులు, పునాది దశ దాటి మొదటి బిల్లు అందుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించుకుంటున్నారు. చాలామంది 12 నుండి 24 వాయిదాల్లో రుణం చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నారు. సంఘాల్లో పాత అప్పులు లేనివారు, డిఫాల్టర్లు కాని వారికి మాత్రమే బ్యాంకులు ఈ రుణాలు అందిస్తాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 12,038 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణం పొందేందుకు 7,287 మంది అర్హులుగా గుర్తించబడ్డారు. వీరిలో ఇప్పటికే 1,900 మందికి పైగా లబ్ధిదారులకు రూ. 22.83 కోట్లను రుణంగా అందించారు. మిగిలిన వారికి ఆగస్టు నెలాఖరు వరకు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో 551 మందికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో 351 మందికి డ్వాక్రా రుణాలు అందజేశారు.

జిల్లాలో మొత్తం 8,252 మంది లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణానికి 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 466 మందికి రుణం ఇవ్వాలని గుర్తించారు. వనపర్తి, నారాయణపేట జిల్లాలలో కూడా పలువురికి రుణాల మంజూరుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రుణ పథకం నిరుపేద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది, తద్వారా రాష్ట్రంలో గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయపడుతుంది.

## పత్తి మధ్య మునగ నాటండి

**కలెక్టర్ జితేష్ పాటిల్ సూచన**

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** పత్తి పంట మధ్య మునగ సాగు చేయడం ద్వారా లాభాలను రెట్టింపు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ పాట్టీని రైతులకు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయంలోఅత్యధిక లాభాలు గడించి ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో రైతులు శ్రమించి మంచి పంటలు పండించుకుంటూ వ్యవసాయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారన్నారు. అయితే ఇంకా కొన్ని అవకాశాలను రైతులు వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా మునగ సాగు గురించి గత సంవత్సరంలో మేము చేసిన అవగాహన కార్యక్రమాల వల్ల జిల్లాలో దాదాపు 100 ఎకరాల్లో మునగ సాగు జరిగిందని అలాగే పత్తితో పాటు మునగను అంతరపంటగా వేసిన రైతుల సంఖ్య కూడా 300 ఎకరాలకు చేరుకుందన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి: : పీడీఎస్‌యూ



**దశ హుజురాబాద్:** హుజురాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమైన హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్‌ను తక్షణమే విధుల్లోంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీపుల్స్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (పీడీఎస్‌యూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ నేతృత్వంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటున్నాయని, రకరకాల పరీక్షల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అందినకాడికి దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఈ అక్రమాలను అరికట్టడంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఎలాంటి పర్యవేక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చందు నాయక్ అవినీతి మత్తులో మునిగిపోయి, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు కొమ్ముకాస్తున్నారని కుమార్ ధ్వజమెత్తారు. ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న చందు నాయక్‌పై తక్షణమే విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అంతేకాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రమేష్, పద్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు

## ఆత్మరక్షణ కోసమే సింధూర్: రాజ్‌నాథ్

**దశ, న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్ పై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేసింది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల సమయంలో చర్చ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఆత్మరక్షణ కోసమే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. లోక్‌సభలో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ.. భారత సైనికులకు హ్యాట్యాఫ్. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత సైనిక చర్య భారతదేశ సైనిక సామర్థ్యానికి, నిర్ణయాత్మక నాయకత్వానికి ప్రతీక అని అన్నారు. లోక్‌సభలో రక్షణ సింగ్ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ఈ దేశ సరిహద్దులను కాపాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్న వీర సైనికులకు నమస్కరిస్తున్నాను.

అదే సమయంలో భారతదేశ ఐక్యత, సమగ్రతను చాటి చెప్పేందుకు తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులకు నేను శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. దేశ ప్రజల తరపున సైనికులందరికీ కృతజ్ఞతలు. ఎవరైనా సైన్యం గురించి మాట్లాడితే ఆచితూచి, ఆలోచించి మాట్లాడాలని " అన్నారు.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ధర్మాన్ని కాపాడుకోవడానికి సుదర్శన చక్రాన్ని ఎంచుకోవాలని శ్రీకృష్ణుడి నుంచి మనం నేర్చుకున్నాము. 22 నిమిషాల్లో పూర్తి చేశాం. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. పాక్ లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆపరేషన్ నిర్వహించాం. పీఓకే, పాక్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. 7 ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. ఆపరేషన్ సిందూర్ కేవలం 22 నిమిషాల్లోనే ముగిసింది. కానీ ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైన్యం మనపై ప్రతీకార దాడులకు దిగింది. దాంతో మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారు. పాక్ అస్త్రాలను మన రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకుని, తిప్పికొట్టాయి. మన దాడుల్లో పాక్ గడ్డపై ఓ మిస్సైల్ లాంచింగ్ స్టేషన్ ధ్వంసమైంది.

## బావిలో పడిన ఆటో.. ఒకరి మృతి

**దశ, మహబూబాబాద్:** రహదారి పక్కన ఉన్న వ్యవసాయ పాతబావిలో ప్రమాదవ శాత్తు ఆటో పడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో చోటు చేసుకుంది. మునిగలవీడుకు చెందిన శ్రీరాం నర్సయ్య(65), ఆయన భార్య భారతమ్మ, కుమారుడు మార్కండేయ.. మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపు రంలో బంధువుల అంత్యక్రియలకు హాజరై, ఆదివారం అర్ధరాత్రి వారి సొంత ఆటోలో తిరిగి వస్తున్నారు. మునిగలవీడు గ్రామంలోకి వెళ్లే రహదారికి సమీపంలో ఉన్న పాత బావిలోకి ప్రమాదవ శాత్తు ఆటో దూసుకెళ్లింది. ఈ ఘటనలో తండ్రి శ్రీరాం నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందారు. భారతమ్మ, మార్కండేయలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎం జిఎం కు తరలించారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్

**కరెంట్ పోల్ కు ఢీ.. యువకుడి మృతి..**
**ముగ్గురికి తీవ్ర గాయాలు**

**దశ, మెదక్:** చిన్నశంకరంపేట పెట్రోల్ పంప్ సమీపంలో మద్యం మత్తులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఫ్రెండ్ బర్త్ డే కోసం నలుగురు యువకులు ఎర్టీగా కారు రెంట్ కి తీసుకుని వెళ్లారు. బర్త్ డే పార్టీలో మద్యం సేవించారు. తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున మద్యం మత్తులో కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో కారు బోల్తా కొట్టింది. ఘటనలో జశ్వంత్ (18) మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న నలుగురు యువకులు 20 ఏళ్ల లోపు వారే.

## యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ 1.25 కోట్లు

**కొత్తగూడెం ఏరియా జీఎం రాజు**



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమం అదేవిధంగా వారి శ్రేయస్సు కొరకు ఎంతగానో కృషి చేస్తుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజు పేర్కొన్నారు. కార్మిక సంక్షేమంలో భాగంగా సింగరేణి యాజమాన్యం గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కెనరా బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో శాలరీ ఎకౌంటు కలిగి ఉన్న సింగరేణి ఉద్యోగులస్తులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ ను కోటి రూపాయల నుండి కోటి 25 లక్షల రూపాయల వరకు ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఏరియా జీఎం శాలెం రాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆధ్వర్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారితో కోటి 25 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ పై ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.